క్లుప్తంగా

నేడు క్యూఆర్ కోడ్ ఆవిష్కరణ కార్యక్రమం

గుంటూరు రూరల్: మండలంలోని ఏటుకూరు బైపాస్ రోడ్డులో గల ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి బలసాని కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరణ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మండల కన్వీనర్లు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, డివిజన్ ఇన్‌చార్జులు, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల గ్రామ, డివిజన్ స్థాయిలో వివిధ హోదాల్లో ఉన్న నాయకులు కార్యక్రమంలో పాల్గొని కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

విప్లవ వీరుడు భగత్‌సింగ్‌కు నివాళి



పొన్నూరు: దేశ స్వాతంత్ర్యం కోసం తన ప్రాణాన్ని తృణప్రాయంగా అర్పించిన విప్లవ వీరుడు సర్దార్ భగత్‌సింగ్ అని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి ఆరేటి రామారావు అన్నారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయం వద్ద భగత్‌సింగ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. భగత్‌సింగ్ చిత్రపటానికి రామారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి పులిపాటి రాజు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో షేక్ నజీమ్ బాబు, సాజిత్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు ఇచ్చిన హామీ నెరవేర్చాలి



తాడేపల్లి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ డిమాండ్ చేశారు. ఆదివారం బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కార్మికులకు నారా లోకేష్ హామీ ఇచ్చారని దాన్ని నెరవేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో నవనీతం, సూర్యప్రకాష్, ఖాసిం, ఆదినారాయణ, దాన్య, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

పాదాల గాయాల చికిత్సపై అవగాహన



తెనాలిరూరల్: ఇండియన్ పోడియాట్రి అసోసియేషన్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో తెనాలి బోస్ రోడ్డులోని ఐఎంఏ కార్యాలయలలో కంటిన్యూయింగ్ మెడికల్ ఎడ్యుకేషన్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. మధుమేహ వ్యాధిగ్రస్తులలో వచ్చే కాళ్ల పుండ్లు, పాదాల గాయాలు వాటి చికిత్స, ఆధునిక శస్త్ర చికిత్సల గురించి వైద్య నిపుణులు వివరించారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోగినేని ఉమ ముఖ్య అతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఐఎంఏ తెనాలి శాఖ అధ్యక్షుడు డాక్టర్ కె. అనిల్‌కుమార్, డాక్టర్ జి. మధుప్రభాకర్, ఐపీఏ కార్యదర్శి డాక్టర్ మనోహర్హా గన్నెన, డాక్టర్ చందు సాంబశివుడు, డాక్టర్ పావని ప్రియాంక, డాక్టర్ ఉదయ్ చందు, డాక్టర్శ్రీ హర్ష, డాక్టర్ కొమ్మినేని జగదీష్, గోగినేని రమేష్, డాక్టర్ గంటా నరసింహారావు, డాక్టర్ శేషగిరిరావు, డాక్టర్ జీవీ సుబ్బారావు, డాక్టర్ మస్తానమ్మ, డాక్టర్ పురుషోత్తం, డాక్టర్ ఎంవీ సత్యనారాయణ, డాక్టర్ నీలిమ, డాక్టర్ గుత్తి ప్రసాద్, డాక్టర్ శ్రీనివాస్, ఇతర వైద్యులు పాల్గొన్నారు.

200 మందికి వైద్య పరీక్షలు

చెరుకుపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిచటం అభినందనీయమని నియోజకవర్గ టీడీపీ నాయకుడు అనగాని శివప్రసాద్ అన్నారు. మండలంలోని గుళ్ళపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం యజ్ఞ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని శివప్రసాద్ ప్రారంభించారు. ఈ వైద్య శిబిరానికి మండలం నలుమూలల నుంచి వచ్చిన 200 మందికి యజ్ఞ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ బెల్లంకొండ శ్రీకాంత్, డాక్టర్ మాధవి, డాక్టర్ పవన్ కుమార్‌లు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసి తగు సూచనలు అందించారు.

సమస్యలతో సహవాసం

- పొన్నూరు శివారు కాలనీలను గాలికొదిలేసిన అధికారులు
- ఖాళీ స్థలాల్లో పిచ్చి చెట్లు.. విజృంభిస్తున్న దోమలు
- డ్రెయిన్లు లేక అస్తవ్యస్తంగా మురుగునీటి వ్యవస్థ
- ఒరిగిన విద్యుత్ స్తంభాలు.. సరఫరాలో అంతరాయం



పొన్నూరు శివారు రవి కాలనీలో ఖాళీ స్థలాల్లో పెరిగిన పిచ్చి చెట్లు

పొన్నూరు: పట్టణంలోని పలు శివారు కాలనీల్లో సమస్యలు తిష్ట వేశాయి. కనీస మౌలిక సదుపాయాలు కొరవడడంతో ఇబ్బందుల మధ్య ప్రజలు జీవనం సాగిస్తున్నారు. ప్రధానంగా మురుగు వ్యవస్థ సరిగా లేకపోవడంతో మురుగు, వ్యర్థాలు పేరుకుపోయి దోమల వ్యాప్తి అధికంగా ఉంటోంది. నివాసాల నడుమ ఉన్న ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి దోమలు, విష పురుగులకు ఆవాసంగా మారాయి. శివారు ప్రాంతాలను అధికారులు విస్మరిస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. అపరిష్కృతంగా ఉన్న సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

దోమల మయం.. రోగాల నిలయం

ప్రధానంగా నిడుబ్రోలు రవి కాలనీలో అనేక సమస్యలతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలనీలో ఖాళీ స్థలాల సమస్య ఎక్కువగా ఉందని, పిచ్చి చెట్లు ఏపుగా పెరగడంతో విష పురుగులు సంచరిస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. వర్షం పడితే మురుగు నీరు నిలిచి పోయి దోమల బెడద ఎక్కువగా ఉందని గగ్గోలు పెడుతున్నారు. రాత్రిళ్లు క్రిమికీటకాలు, విష పురుగులు సంచరిస్తున్నాయని తెలిపారు. డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడం, ఉన్నా రోజూ పూడిక తీయకపోవడంతో పారుదల లేక మురుగు నీరు ఎక్కడికక్కడ స్తంభిస్తోంది. దీంతో దుర్గంధంతో పాటు, అపరిశుభ్ర వాతావరణం ఏర్పడుతుంది. ఈ కారణంగా జ్వరాల బారిన పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఒరిగిన విద్యుత్ స్తంభం

- వీధిలో ఒక్క కుళాయి మాత్రమే ఉండటంతో తాగునీటి కోసం ఇబ్బందులు పడాల్సి వస్తోందని స్థానిక మహిళలు ఆవేదన వక్తం చేస్తున్నారు. వీధిలో విద్యుత్ స్తంభాలు కుంగిపోయి, ఒరిగిపోయి ప్రమాదకరంగా మారాయని, వైర్లు అస్తవ్యస్తంగా ఉండటంతో విద్యుత్ సరఫరాలో కూడా అంతరాయం ఏర్పడుతోందని తెలిపారు. అధికారుల దృష్టికి ఎన్నిసార్లు సమస్య తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందని మహిళలు చెబుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి కాలనీలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

> **అధికారులు పట్టించుకోవడం లేదు**
>
> దశాబ్దాలుగా కాలనీలో జీవనం సాగిస్తున్నా వసతులు లేక అవస్థలు పడుతున్నాం. వీధిలో ఖాళీ స్థలాల్లో ఏపుగా పెరిగిన చెట్లతో దోమలు విజృంభిస్తున్నాయి. దీంతో రోగాల బారిన పడుతున్నాం. విద్యుత్ స్తంభాలు ఒరిగి సరఫరాలో అంతరాయం కలుగుతోంది. అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలి.
>
> – యేసు, స్థానికుడు, రవి కాలని

వైభవంగా దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు



నంబూరు నాగారపమ్మ దేవాలయ ఆవరణలో...



నంబూరు వల్లీదేవసేన సమేత సుబ్రమణ్యేశ్వర స్వామి దేవస్థానం వద్ద...



మంచాల గ్రామంలో మహాచండీదేవిగా...

పెదకాకాని: దసరా నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మండలంలోని గ్రామాల్లో కనకదుర్గ అమ్మవారి విగ్రహాలను ఆలయ ప్రాంగణాల్లోనూ, ప్రత్యేకంగా అలంకరించిన పందిళ్లలోనూ ఏర్పాటు చేశారు. ప్రతి రోజూ ఒక్కో అలంకారంలో అమ్మవారిని అలంకరించి పూజలు చేస్తున్నారు. గ్రామాల్లో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ఈ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం నంబూరు నాగారపమ్మ ఆలయ ప్రాంగణంలో ఎస్‌బీఆర్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కనకదుర్గ అమ్మవారు చాముండేశ్వరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. రాత్రి వేళల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అలానే నంబూరు వల్లీదేవసేన సమేత సుబ్రమణ్యేశ్వరస్వామి దేవస్థానం వద్ద ఏర్పాటు చేసిన కనకదుర్గ అమ్మవారిని మహాచండీ దేవిగా అలంకరించి పూజలు చేశారు. నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

చేబ్రోలు మండలంలో...

చేబ్రోలు: మండలంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం వివిధ గ్రామాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రమైన చేబ్రోలులో ఖ్యాతి గాంచిన గంగాపార్వతి సమేత నాగేశ్వరస్వామి దేవాలయంలో పార్వతి అమ్మవారు కాత్యాయనీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. భీమేశ్వరస్వామి దేవస్థానంలో బాలాత్రిపుర సుందరి అమ్మవారు వనబాలాదేవిగా ప్రత్యేక పూజలు అందుకున్నారు. మండల పరిధిలోని నారాకోడూరులో శ్రీలక్ష్మీ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారు మహాచండీదేవీ అలంకారంలో దర్శనమిచ్చారు. శ్రీరంగపురం గ్రామంలోని గ్రామ దేవత నాంచారమ్మతల్లి అమ్మవారు గాజులతో ప్రత్యేక అలంకారంలో దర్శనమిచ్చారు. మంచాల గ్రామంలో కనకదుర్గ అమ్మవారు మహాచండీదేవీగా దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

పొన్నూరులో...

పొన్నూరు: దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు పొన్నూరులో వైభవంగా నిర్వహిస్తున్నారు. కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం అమ్మవారిని విశేషంగా అలంకరించి పూజలు నిర్వహించారు. పట్టణంలోని కోదండ రామాలయంలో అమ్మవారు మంగళగౌరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు చిలకపాటి లక్ష్మణ్ రామాచార్యులు పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను ఆలయ అధికారులు, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

లలితాత్రిపుర సుందరిగా అమ్మవారు

గుంటూరు రూరల్: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మండలంలోని చల్లావారిపాలెం గ్రామంలో వేంచేసియున్న పుట్టలమ్మతల్లి, ఘంటాలమ్మతల్లి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఆదివారం ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, మహాచండీ హోమం నిర్వహించారు. అమ్మవారిని లలితాత్రిపుర సుందరి దేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులకు తీర్థప్రసాదాలను వితరణ చేశారు.



చేబ్రోలులోని గంగాపార్వతి సమేత నాగేశ్వర స్వామి దేవాలయంలో...



భీమేశ్వరస్వామి దేవస్థానంలో...



గాజులతో ప్రత్యేక అలంకారంలో గ్రామ దేవత నాంచారమ్మ తల్లి



పొన్నూరు కోదండ రామాలయంలో...



చల్లావారిపాలెంలో లలితాత్రిపుర సుందరిగా...

పూర్వ విద్యార్థుల నూతన కమిటీ ఎంపిక చట్ట విరుద్ధం



మాట్లాడుతున్న పూర్వ విద్యార్థుల సలహామండలి సభ్యుడు మందాళ వీరారెడ్డి

పెదకాకాని: పూర్వ విద్యార్థుల కమిటీ ఎంపిక చట్ట విరుద్ధమని సలహామండలి సభ్యుడు మందాళ వీరారెడ్డి అన్నారు. పెదకాకాని మండలంలోని నంబూరు శ్రీ ప్రోలయ వేమన జిల్లా పరిషత్ పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం చట్ట విరుద్ధంగా చేసిన రహస్య ఎంపికను ఖండిస్తూ విలేకరుల సమావేశం నిర్వహించారు. పాఠశాల గేటు ముందు ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మందాళ వీరారెడ్డి మాట్లాడుతూ 2022వ సంవత్సరంలో పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులందరూ కలసి తాత్కాలికంగా అడహాక్ కమిటీని ఎన్నుకోవడం జరిగిందన్నారు. అదే సంవత్సరంలో మూడు రోజుల పాటు ప్లాటినం జూబ్లీ వేడుకలు నిర్వహించడం జరిగిందని, ఈ వేడుకలకు సుమారు రూ.34 లక్షలు ఖర్చు కాగా ఇంకా రూ.11 లక్షలు బ్యాంక్ బ్యాలెన్స్ ఉందని అన్నారు. ఆ తరువాత ప్లాటినం జూబ్లీ వేడుకలకు గుర్తుగా గ్రామంలో చందాలు వసూలు చేసి రూ.52 లక్షలతో పాఠశాలలో నూతన భవనం నిర్మించడం జరిగిందని తెలిపారు. 600 మంది శాశ్వత కమిటీ సభ్యులు ఉండగా ఈ నెల 26వ తేదీన రహస్యంగా కోరం కూడా లేకుండా కమిటీని ఎన్నుకోవడం జరిగిందన్నారు. కమిటీ ఎంపిక చట్ట విరుద్ధమని, కమిటీ రెన్యువల్ కూడా జరగలేదని పేర్కొన్నారు. కమిటీ అధ్యక్షుడు ఈమని ప్రతాపరెడ్డి, ప్రధాన కార్యదర్శి నంబూరు నాగేశ్వరరావు, పెదకాకాని రిజిస్ట్రార్ కార్యాలయం, బ్యాంక్‌కు చట్టపరంగా నోటీసులు ఇవ్వడం జరిగిందన్నారు. కోటి రూపాయలు ఖర్చు చేసిన కమిటీ లెక్కలు చెప్పకుండా, నకిలీ రశీదులు ఇస్తున్నారన్నారు. ఈ సమావేశంలో సలహా మండలి సభ్యులు సయ్యద్ సుభాని, నంబూరు కిషోర్, గుజ్జుల బసంతి, శనగల శివమ్మ, వుయ్యూరు ముత్తారెడ్డి, బుర్రి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నారాకోడూరు జెడ్పీ హైస్కూల్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో గురువులు, పూర్వ విద్యార్థులు

చేబ్రోలు: చేబ్రోలు మండలం నారాకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2000–2001 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. నారాకోడూరు జెడ్పీ హైస్కూల్‌లో జరిగిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక కార్యక్రమంలో వారికి బోధించిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఇక్కడ చదువుకొని వివిధ ప్రాంతాల్లో వృత్తి, ఉద్యోగ, వ్యాపారాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులను ఉపాధ్యాయులు దీవించి, అమూల్య సందేశాన్నిచ్చారు. ప్రస్తుత జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం ఎం.ఏడుకొండలు మాట్లాడుతూ బడి రుణం తీర్చుకుందాం కార్యక్రమంలో భాగంగా పాఠశాల అభివృద్ధి కార్యక్రమాలు చేయటం జరుగుతుందని అందుకు సహకరించిన పూర్వ విద్యార్థులు, గ్రామస్తులకు అభినందనలు తెలిపారు.

1993–94 బ్యాచ్ విద్యార్థుల సమావేశం

చేబ్రోలు: ఉపాధ్యాయులే విద్యార్థులకు మార్గదర్శకులు అని చేబ్రోలు మండలం వేజండ్ల ఎంపీపీ స్కూల్ హెచ్‌ఎం పరాశరం శ్రీనివాసమూర్తి అన్నారు. చేబ్రోలులో రాఘవేంద్ర విద్యాసంస్థల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సూర్యదేవర నరసయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం జరిగింది.



చేబ్రోలులో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో ఉపాధ్యాయులకు సన్మానం

1993–94 సంవత్సరం బ్యాచ్ విద్యార్థుల సమావేశంలో విద్యా సంస్థ కరస్పాండెంట్ గట్టుపల్లి శ్రీనివాసరావు, నజీర్ చాంద్, శ్రీనివాసమూర్తిలను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. చదువుకున్న రోజులను పూర్వ విద్యార్థులు గుర్తు చేసుకొని ఆనందించారు. పూర్వ విద్యార్థులు అల్లం నాగేశ్వరరావు, ముసలా నాగరాజు, అరుణ జ్యోతి, శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలి



మాట్లాడుతున్న ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పద్మ

పెదకాకాని: కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు మహిళలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు కె.పద్మ అన్నారు. పెదకాకాని సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం మహిళా సంఘం గ్రామ మహాసభ జెట్టి రాజలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు కె.పద్మ మాట్లాడుతూ పని గంటలు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం వలన మహిళలు కుటుంబ, సామాజిక, రాజకీయ అంశాలకు సమయం కేటాయించుకోవటం మరింత తగ్గిపోతుందన్నారు. మహిళలు పని ఒత్తిడికి గురవుతారని వెంటనే ఈ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. 18 సంవత్సరాలు నిండిన ఆడపిల్లలకు నెలకు రూ.1,500 ఇస్తామని చేసిన వాగ్దానం ప్రభుత్వం వెంటనే అమలు చేయాలన్నారు. సులభతరంగా బ్యాంకుల ద్వారా తక్కువ వడ్డీకి మహిళలకు రుణాలు అందించి తద్వారా మైక్రో ఫైనాన్స్ వడ్డీ భారాలు లేకుండా చూడాలని కోరారు. స్థానికంగా పారిశుధ్య పనులు సక్రమంగా లేనందున, కలుషితమైన నీరు తాగి అనారోగ్యానికి గురవుతున్నారని, తక్షణమే పారిశుధ్య పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. మంగళగిరిలో అక్టోబర్ నెల 8వ తేదీన జరిగే జిల్లా మహాసభలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. నూతన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా కె.రమ్య, జెట్టి రాజ్యలక్ష్మి ఎన్నికయ్యారు. ఈ సభలో కుమారి, రోజారజినీ, మరింబి, భవాని, శివమ్మ పాల్గొన్నారు.

తాడేపల్లిలో కంట్రోల్ రూం

తాడేపల్లి రూరల్: భారీ వర్షాలు హెచ్చరికల నేపథ్యంలో లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తాడేపల్లి తహసీల్దార్ సీతారామయ్య ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికే కృష్ణానదిలో 6.5 లక్షల క్యూసెక్కుల నీరు చేరుకుందని, లోతట్టు ప్రాంతాల ప్రజల సౌకర్యార్థం తాడేపల్లి తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఇది 24 గంటలూ పనిచేస్తుందని, సోమ, మంగళ, బుధ వారాల్లో కంట్రోల్ రూమ్‌లో వివిధ శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఏదైనా అవసరమైతే 87903 96195 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

అడుగుకో గుంత.. గజానికో గొయ్యి



గోతులమయమైన నడింపాలెం రోడ్డు



ఎస్సీ కాలనీకి వెళ్లే దారిలో



హైవేకు వెళ్లే దారిలో రేగితోటల సమీపంలో

ఇక్కడ కనిపిస్తున్న ఈ రోడ్ల చిత్రాలను చూడండి. అడుగుకో గుంతతో.. గజానికో గొయ్యితో.. ఈ రహ'దారి'కో దండం అనేలా మారాయి. ఇదేదో మారుమూల గ్రామానికి చెందిన రోడ్డు అనుకుంటే పొరబడినట్లే. ప్రత్తిపాడు నుంచి 16వ నంబరు జాతీయ రహదారికి అనుసంధానం చేసే నడింపాలెం–ప్రత్తిపాడు రోడ్డు ఇది. దారి పొడవునా భారీ గుంతలు, గోతులతో రహదారి అంతా దారుణంగా తయారయింది. ప్రధానంగా హైవే నుంచి గ్రామంలోని ముస్లిం కాలనీ వరకు గోతులు చూస్తే ఒళ్లు జలదరించాల్సిందే. మామూలు రోజుల్లోనే ఈ రోడ్డులో ప్రయాణం అంతంత మాత్రంగా ఉంటుంటే.. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఇదిగో ఇలా గుంతల్లో నీళ్లు నిలిచి, ప్రయాణం చేయాలంటేనే నిత్యం ఇదేమి 'దారి'ద్ర్యమో.. అంటూ ప్రజలు పెదవి విరుస్తున్నారు. ఇదే మార్గంలో ప్రతి రోజూ హైవేలో ఉన్న అనేక కంపెనీల్లో పని చేసేందుకు కార్మికులు, ప్రజలు, ఉద్యోగులు వందల సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. వీరి బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. రాళ్లు లేచి ఎప్పుడు జారి పడతారో తెలియని పరిస్థితి. – ప్రత్తిపాడు